- నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాలకు గులాబీ బాస్ కేసీఆర్ పర్యటన
- మధ్యాహ్నం అలంపూర్, కొల్లాపూర్, సాయంత్రం నాగర్‌కర్నూల్, కల్వకుర్తిలో..
- నాలుగు చోట్ల ప్రజా ఆశీర్వాద సభలు
- జన సునామీని తలపించేలా మీటింగ్‌లు
- 22న మహబూబ్‌నగర్‌కు ప్రగతి ప్రదాత

# రేపే దళపతి రాక


నాగర్‌కర్నూల్‌లో సీఎం సభకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 19న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి సుడిగాలి పర్యటనకు శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ ఎన్నికల సమరం జోరందుకున్న తరుణంలో ఏకంగా నాలుగు నియెజకవర్గాల్లో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేస్తున్నారు. నామినేషన్ల ఘట్టం ముగిసిన తర్వత ప్రచారం జోరందుకున్న తరుణంలో గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలో చేపట్టిన ప్రజాఆశీర్వద సభలు కీలకంగా మారాయి.

**మిగిలింది.. 12 రోజులే..**

ఎన్నికలకు ఇంకా సరిగ్గా 12 రోజులే మిగిలి ఉన్నది. అన్ని పార్టీల అధినేతల పర్యటనలతో రాజకీయం వేడెక్కింది. ఆయా పార్టీలు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్న తరుణంలో కేసీఆర్ అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల పర్యటన ఆత్యంత ప్రధాన్యతను సంతరించుకున్నది. బీఆర్‌ఎస్ నాలుగు నియోజకవర్గాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. అలంపూర్‌లో చివరి నిమిషంలో అభ్యర్థిని మార్చారు. నాగర్‌కర్నూల్, కల్వకుర్తిలో ఎమ్మెల్సీ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్‌తో దోస్తీ కట్టారు. కొల్లాపూర్‌లో పార్టీలో ఉంటూ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో సస్పెండ్‌కు గురయ్యారు. వీరంతా కాంగ్రెస్ పంచాన చేరి బీఆర్‌ఎస్‌నే ఢీకొడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నాలుగు సభలు అత్యంత కీలకంగా మారాయి. ఇప్పటికే ప్రచార హోరు తారాస్థాయికి చేరుకున్నది.

**కనీవినీ ఎరుగని రీతిలో..**

అసెంబ్లీ ఎన్నికలు చివరి అంకంలో ప్రవేశించిన దశలో ప్రగతి ప్రదాత కేసీఆర్ ఏకంగా మరోసారి నాలుగు సభల్లో పాల్గొనబోతున్నారు. ఈనెల 6న నాలుగు సభలకు హాజరుకావడంతో శ్రేణుల్లో జోష్ నెలకొన్నది. తాజాగా మరో నాలుగు సభలతో కేసీఆర్ ఏకంగా 11 నియోజకవర్గాలను కవర్ చేసినట్లు అవుతుంది. ఇప్పటి వరకు జరిగిన ఏడు ప్రజా ఆశీర్వద సభలకు జనం పోటెత్తారు. ఈసారి కూడ నాలుగు చోట్ల సభలను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ అభ్యర్థులు శ్రమిస్తున్నారు. అలంపూర్‌లో ఎమ్మెల్సీ చల్లావెంకట్రామిరెడ్డి అన్ని తానై వ్యవహరిస్తూ అధినేత పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రతిష్టాత్మంగా తీసుకుని ప్రజా ఆశీర్వద సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేలా జనాలను తరలించే ప్లాన్‌లో ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కూడా ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సభకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. కల్వకుర్తిలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పార్టీ శ్రేణులను కలుపుకొని భారీ ఎత్తున ఏర్పాట్లు చేయడంలో మునిగిపోయారు. 22న మహబూబ్‌నగర్‌లో జరిగే ప్రజా ఆశీర్వద సభలో కేసీఆర్ వస్తుండటంతో 12 నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించినట్లు అవుతుంది. జననేత పాల్గొనే సభలను గ్రాండ్ సక్సెస్ చేసే రీతిలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

**తుది దశలో కేసీఆర్ దేఖ్‌లేంగే...**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మరోసారి బీఆర్‌ఎస్ సత్తా చాటాలని ప్రయత్నిస్తుంది. ఈమేరకు 12 నియోజకవర్గాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని గెలుపు దిశగా అడుగులు వేస్తున్నది. దీంతో తుది దశకు చేరుకున్న అసెంబ్లీ సమరం మరింత రసవత్తరంగా మారింది. కేసీఆర్ సుడిగాలి పర్యటనలతో గులాబీ దళంలో జోష్ పెరిగింది. ప్రగతి ప్రదాత రాకతో గెలుపు అవకాశాలు మరింత పెరుగుతాయని, ప్రజలు కేసీఆర్‌ను ఆదరిస్తారన్న ధీమాలో ఉన్నారు. పదేండ్లలో పాలమూరు ప్రగతిని పరుగులు పెట్టించారు.. పార్టీ ఎమ్మెల్యేలు అడిగిన ప్రతి కార్యక్రమాన్ని కాదనకుండా మంజూరు చేశారు. ఇటు అభివృద్ధి, అటు సంక్షేమ పథకాలతో అభివృద్ధిని పరుగులు పెట్టించారు. కండ్లముందే కనిపిస్తున్న ప్రగతి, ఇంటింటికీ అందుతున్న పథకాలతో లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను నమ్మే స్థితిలో జనం కనిపించడం లేదని తేటతెల్లమవుతుంది. దీంతో అసెంబ్లీ ఎన్నికలు తుది దశలో కేసీఆర్ దేఖ్‌లేంగే అనే సవాల్ విసురుతూ ప్రజాఆశీర్వద సభలతో విపక్షాలకు ఝలక్ ఇస్తున్నారు. ఇదే జిల్లాకు చెందిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తెలంగాణపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు, రైతులపై చేస్తున్న కామెంట్లు హాట్‌టాపిక్‌గా మారాయి. ఈ తరుణంలో జరిగే ప్రచార సభలు మరింత ఎన్నికల వేడిని రగిలిస్తున్నాయి.

### నాలుగు చోట్ల ప్రజా ఆశీర్వాద సభలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మరోసారి కేసీఆర్ శంఖారావం పూరించనున్నారు. ఏకంగా నాలుగు చోట్ల ప్రజాఆశీర్వద సభలు పెట్టి పార్టీ నేతలు తమ తడాఖా చూపించనున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు అలంపూర్ జోగుళాంబ దేవి సాక్షిగా ప్రజాఆశీర్వద సభ ప్రారంభం కానున్నది. హెలికాప్టర్‌లో ఇక్కడకు చేరుకోనున్నారు. చివరి నిమిషంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిని మార్చి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామరెడ్డి అనుచరుడు విజయుడుకు బీఫాం అందించారు. తర్వాత అన్నీ తానై సభను విజయవంతం చేసేందుకు పక్కా స్కెచ్ వేశారు. ఈ తరుణంలో ఇక్కడ సభ ముగించుకొని సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు కొల్లాపూర్ చేరుకుంటారు. పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో సభ జరగనున్నది. అనంతరం అక్కడి నుంచి సాయంత్రం నాలుగు గంటలకు నాగర్‌కర్నూల్‌లో జరిగే ప్రచార సభలో పాల్గొనున్నారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా జనాన్ని తరలించే పనిలో శ్రేణులు నిమగ్నమయ్యారు. కల్వకుర్తిలో జరిగే సభ చివరిది. సాయంత్రం 5 గంటలకు చేరుకుని ఇక్కడ జరిగే సభలో పాల్గొంటారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రజాఆశీర్వద సభ కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బీఆర్‌ఎస్‌కు పోటీగా.. పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికై.. నేడు కాంగ్రెస్ టికెట్‌తో ఎన్నికల రంగంలోకి దిగడంతో ఇక్కడ కేసీఆర్ సభ ప్రతిష్టాత్మకంగా మారింది.


నాగర్‌కర్నూల్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి

# టికెట్లు అమ్ముకునోళ్లు.. రాష్ట్రాన్ని అమ్ముకోరా?

- కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు
- భారీ మెజార్టీతో లక్ష్మారెడ్డిని గెలిపించాలి
- మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

నవాబ్‌పేట, నవంబర్ 17 : ఎమ్మెల్యే టికెట్లనే అంగట్లో సరుకులాగా అమ్ముకున్న కాంగ్రెస్ నాయకులు.. అధికారమిస్తే రాష్ట్ర ఆస్తులన్నీ తాకట్టుపెట్టి అమ్ముకునే పరిస్థితులు వస్తాయని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ ఘాటుగా విమర్శించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మండల బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రాన్ని 55ఏండ్లు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు కనీసం తాగునీరు కూడా ఇవ్వలేకపోయిందని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాతనే గ్రామాల్లో ప్రజలకు కనీస వసతులు కల్పించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సాహసోపేతమైన పథకాల వల్లే రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. అలాంటి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని, కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి మూడోసారి భారీ మెజార్టీతో గెలిచేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ అనంతయ్య, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ చందర్‌నాయక్, సర్పంచులు గోపాల్‌గౌడ్, సత్యం, ఎంపీటీసీ గోపీకృష్ణ, నాయకులు రాంప్రసాద్, పురుషోత్తం, సీనయ్య, అబ్దుల్లా, కృష్ణగౌడ్, లక్ష్మయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో నిబద్ధత ముఖ్యం


ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్, నవంబర్ 17 : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్, ఎన్నికల అధికారి రవినాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం సమీపంలోని జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాల్లో కల్పించే సదుపాయాల్లో మార్పులు, చేర్పులను ఆదివారంలోపు పూర్తి చేయాలని పలు అంశాలపై కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా తదితరులకు అవసరమైన దారులతోపాటు సదుపాయాలను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా బారికేడ్లు ఉండాలని, వాహనాలను నిలిపేందుకు కౌంటింగ్ కేంద్రానికి దూరంగా పార్కింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. స్ట్రాంగ్‌రూంలు కట్టుదిట్టంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్పీ శ్రీహర్షవర్ధన్, రిటర్నింగ్ అధికారులు నటరాజ్, అనీల్‌కుమార్, పంచాయతీరాజ్ ఈఈ నరేందర్, డీఆర్వో కేవీ రవికుమార్, అదనపు ఎస్పీ రమణారెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ విష్ణు, ఏఆర్వో నాగార్జున పాల్గొన్నారు.